లక్ష్మణ రేఖ

చెంప ఛెళ్లుమంది కార్తీకది. 'కొట్టావా, కొడతావా నన్ను' అన్నట్టు మింగేసేట్టు చూసింది కార్తీక.

"నీకెన్నాళ్లు? ఏం చదివావు? ఏం ఉద్యోగం చేస్తున్నావు?" సావిత్రి అరిచింది. కార్తీక కళ్లు పెద్దవి చేసి తెలీక అడుగుతున్నావా అన్నట్టు కోపంగా చూసింది.

"పాతిక దాటాయి, అమెరికాలో ఎమ్మెస్ చేసి వచ్చావు. పెద్ద కార్పోరేట్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నావు. అయినా ప్రపంచ జ్ఞానం లేదు. చిలక్కి చెప్పినట్టు చెప్పాను. అడ్డమైన వాళ్లతో తిరగద్దని, మేం చూసిన వాడు నచ్చకపోతే నీకు నచ్చినవాడిని వెతుక్కుని చూసుకో అన్నదీ చెప్పాను. స్నేహమంటూ ప్రతీవాడితో క్లబ్బులు, పబ్బులు, డిన్నర్లు, షికార్లు తిరిగితే, రోజుకో మగాడితో తిరిగే ఆడదాన్ని మగాడెవరూ నమ్మడు. తనూ నీతో తిరుగుతాడు కానీ పెళ్లికి పనికిరావనుకుంటాడు అని చెప్పాను. విన్నావా... పర్యవసానం తెల్సిందిగా. పిచ్చి డ్రెస్సులేసుకుని బాయ్ ఫ్రెండ్స్‌తో మోటారు సైకిళ్లమీద తిరగడం ఫ్యాషన్ అనుకున్నావు. ఇప్పుడొచ్చి ఏం చెయ్యను అని నన్నడగడం ఏమిటి? సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఐపాడ్‌ల మధ్య అనుక్షణం గడిపేదానివి. సెల్‌ఫోను ఉపయోగాలు, దురుపయోగాలు తెలియవా? సరదాగా కౌగలించుకున్నట్టు, మొహాలు దగ్గర చేర్చుకుని, భుజాల చుట్టూ చేతులేసుకుని సెల్‌ఫోన్లలో సరదాగా ఫోటోలు చూసుకుని మురిసిపోయిన ఆ ఫోటోలే నీ మెడలో పాముల్లా చుట్టుకుని నిన్ను కాటేయడానికి వాడుకునే ఆయుధాలని తెలిసిందిగా ఇప్పుడు? ఏం చేయను నన్నడిగితే యూ స్టుపిడ్, ఇడియట్ మదర్ ఏం చెబుతుంది? నా లైఫ్, నా ఇష్టం. నాకు తెలుసు అన్నావుగా, నీ ప్రాబ్లమ్ నీవే సాల్వ్‌చేసుకో" ఆవేశంలో ఆగుకుండా ఆయాసం వచ్చే వరకు దులిపి పారేసింది సావిత్రి.

"ఛా... ఛా... ఈ ఆడపిల్లలకి ఎన్ని యుగాలైనా బుద్ధిరాదు. కాలేజీల్లో చదవడం డిగ్రీల కోసం తప్ప ప్రపంచజ్ఞానం కోసం కాదు. పుస్తకాలు, ఇంటర్‌నెట్‌లు, టీవీలు, సినిమాలు అన్నీ చూస్తారు. ఏం నేర్చుకుంటున్నారు" ఆవేశంలో ఆమె మాటలు తడబడ్డాయి.

కార్తీక తల్లి వంక చురచుర చూస్తూ మొహం మాడ్చుకుని లోపలికి వెళ్లిపోయింది. ఏదో ఇన్నాళ్లకి దానికి నచ్చినవాడు దొరికాడు, పెళ్లి చేసుకుంటాం అని చెప్పినప్పుడు - మంచి చదువు, ఉద్యోగం, కుటుంబం అన్నీ బాగున్నాయి. కులాలు వేరయినా సర్దుకున్నారు. పెళ్లి ఇంకో పదిహేనురోజులుండగా ఈ ఉపద్రవం వచ్చిపడిందేమిటి? కూతురు గతంతో ఆడుకోడానికి సిద్ధపడిన వాడిని ఏం చేయాలి? ఈ అమ్మాయి లెప్పుడు బుద్ధి తెచ్చుకుంటారు. ఆ వయసలాంటిదా? ఆ ఆకర్షణ అలాంటిదా? అందులోంచి తప్పించుకోలేని బలహీనతతో తప్పటడుగులు వేసి ఊబిలో దిగ బడతారా? అందరమ్మాయిల్లా కాకపోయినా తెలివితక్కువగా కొందరు, అహం కారంతో కార్తీక లాంటి అమ్మాయిలు తమ అందం డబ్బు చూసి మగపిల్లలని ఆకర్షించాలని, తమ వెంట తిరిగేట్టు చేసుకోవాలని వళ్లుపై తెలీకుండా ప్రవర్తించి, ఉచ్చులోపడి జీవితాలని నాశనం చేసుకుంటున్నారు. కూతురునయితే కసిరేసింది కానీ మనసులో భయాన్ని తీసేయలేకపోయింది సావిత్రి. దిక్కుతోచని దానిలో కూర్చుండిపోయింది.

* * * * * *

"ఏమిటి మళ్లీ తల్లీకూతుళ్లు దెబ్బలాడుకున్నారా? మాటల తూటాలు విసురు కున్నారా" డైనింగ్ టేబుల్ దగ్గర గంభీర వాతావరణం చూసి "ఆ సీన్లకి తెరపడిందను కున్నాను. మళ్లీ ఏం వచ్చింది గొడవ" తేలిగ్గా నవ్వి అన్నాడు అశోక్. కూతురు పెళ్లి కుదిరాక ఇంట్లో ప్రశాంతత ఏర్పడింది. తల్లీ కూతుళ్ల పోట్లాటలు, అరచుకోడాలు వాద ప్రతివాదాలు తగ్గాయి. మళ్లీ ఈ రోజేం వచ్చిందో ఇద్దరూ మొహాలు మాడ్చుకు కూర్చున్నారు. అర్థంకాలేదు అశోక్‌కి.

ఇద్దరూ జవాబివ్వలేదు.

"ఏమిటి, ఎనీ థింగ్ సీరియస్?"

కొంపతీసి రెండు నెలలు తిరిగేసరికి గౌతమ్ అనుకున్నట్టు లేడు. నే చేసుకోను అనిగానీ కూతురు అనలేదు గదా. "సావిత్రీ ఏం జరిగింది?" అసహనం ధ్వనించింది ఆ స్వరంలో.

"మీ ముద్దుల కూతుర్ని అడగండి. నన్ను అడగడమెందుకు?"

"కార్తీ ఏమయిందిరా నాన్నా" లాలనగా అడిగాడు.

"అదిగో... ఈ ముద్దే దాన్నలా తయారుచేసింది" కయ్‌మంది సావిత్రి. కార్తీక చేతిలో అన్నం పళ్లెం విసిరికొట్టి విసవిస వెళ్లిపోయింది లోపలికి.

"ఏం జరిగిందో చెప్తావా?" అసహనంగా అడిగాడు.

"ఆ దినేష్ అనే అబ్బాయి... ఇదివరకు ఇద్దరూ చాలా క్లోజ్‌గా తిరిగారు కదా..."

"ఆ... ఆ... పెళ్లి చేసుకుంటారనుకున్నాం. మళ్లీ చేసుకోం అని అదే అందిగదా."

"ఆ వాడే, ఇప్పుడు దీన్ని బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడుట. నాతో తిరిగావు. ఎంజాయ్ చేశాం. ఇప్పుడు ఇంకెవరినో ఎలా చేసుకుంటావో చూస్తా అని బెదిరించి, సెల్‌లో మన ఇంటిమేట్ ఫోటోలు నీ కాబోయే మొగుడికి చూపిస్తాను అంటున్నాడుట."

"ఎందుకలా... ఇద్దరూ వాళ్లంతట వాళ్లే వద్దనుకున్నారు గదా" తెల్లబడ్డ మొహంతో అన్నాడు అశోక్.

"ఇద్దరూ వద్దనుకోలేదు. ఇది వద్దనుకుంది. పెళ్లికాకముందే అథార్టీ చెలాయించి వాళ్లతో ఎందుకు మాట్లాడావు వీళ్లతో ఎందుకు మాట్లాడావు అంటూ అదుపులో పెట్టాలని చూస్తే ఈవిడ సహిస్తుందా... నీకు నాకు పడదు అంటూ చెప్పేసింది. ఇన్నాళ్లు ఊరుకున్నాడు. ఇప్పుడు పెళ్లి అనగానే వాడిలో అహం తలెత్తింది. తన అసలు రూపం చూపాడు."

"మైగాడ్ ఇప్పుడెలా. ఏం చెయ్యాలి... పెళ్లి శుభలేఖలు కూడా వెళ్లిపోయాయి. గౌతమ్‌కి తెలిస్తే."

"ఇందాకటినించి ఆలోచిస్తున్నాను. ఈ సమస్యకి పరిష్కారం."

"వాడు చెప్పేలోగా దాన్నే గౌతమ్‌తో జరిగింది చెప్పేయమంటే."

"నేనూ అదే అనుకుంటున్నాను. వాడు చెప్పేక సంజాయిషీ చెప్పుకునేకంటే నిజాయితీగా జరిగింది చెపితే గౌతమ్ ఎలా రియాక్ట్ అయినా ఇదే నయం పెళ్లయ్యాక. ఏ క్షణం గౌతమ్‌కి చెపుతాడో అని టెన్షన్‌లో బతికేకంటే ముందే చెప్పేస్తే ఫలితం ఎలా ఉన్నా ఎదుర్కొందాం. ఈ విషయం మీరే దానికి చెప్పండి. నేచెపితే వినదు" సావిత్రి భర్తకి సలహా ఇచ్చింది.

* * * * * *

"హరితా, ఐయామ్ ఇన్ ట్రబుల్... నీ సలహా కావాలే."

"ఏమిటి ఏమయింది?" గొంతులో ఆదుర్దా.

"ఆ రాస్కెల్ దినేష్ లేదూ... నన్ను బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు."

"ఎందుకూ ఏమని, మీ ఇద్దరూ విడిపోయి నాలుగు నెలలయింది. నీవు గౌతమ్‌ని చేసుకుంటున్నావు. ఇపుడేమిటి ప్రాబ్లమ్?"

"ఆ, ఏం లేదు. వాడ్ని కాదని గౌతమ్‌ని చేసుకుంటున్నానని కుళ్లు. ఇన్నాళ్లు ఊరుకున్నాడు. పెళ్లనగానే అసలు కలర్స్ బయటపెట్టాడు. సెల్‌లో ఫోటోలున్నాయి వాడి దగ్గర."

"అసలు నిన్ననాలి. ఆ దినేష్‌గాడు ఓ రోమియో. అలాంటి వాడిని నమ్మావు. వాడితో క్లోజ్‌గా ఉండద్దని ఎంత చెప్పాను."

"ప్లీజ్, నువ్వూ తిట్టకే. వాడి మాటలకి బోర్లా పడ్డాను. కింద కాదు, వాడి వళ్లో. అదే నే చేసిన తప్పు."

"మీ పేరెంట్స్‌కి చెప్పావా... చెప్పడం మంచిది" హరిత సలహా ఇచ్చింది.

"చెప్పా.."

"చెంప పగలకొట్టింది అమ్మ" చిన్నపిల్లలా అంది.

"నిజం...? అంటే, ఆవిడకి ఎంత కోపం వచ్చిందో అర్థం అవుతుంది. మీ డాడి ఏమన్నారు?"

"అమ్మా నాన్న ఇద్దరూ మాట్లాడుకుని దినేష్ గౌతమ్‌కి చెప్పి ఫోటోలు చూపించక ముందే నన్నే చెప్పమంటున్నారు. లేకపోతే పెళ్లయినా ఎప్పుడు చెప్పాస్తాడోనని అనుక్షణం వాడికి భయపడుతూ టెన్షన్‌తో బతకాల్సి ఉంటుంది. నీవే చెపితే నీ నిజాయితీని గౌతమ్ హర్షించవచ్చు. చెప్పాక అతని ఏ నిర్ణయానికైనా తలవగ్గడం మంచిది అంటున్నారు. నీ అభిప్రాయం చెప్పు."

"గౌతమ్‌తో చెప్పడం సరే ఆ రాస్కెల్‌ని అంత ఈజీగా వదిలేయడమేనా? ఆడపిల్లలతో ఎంజాయ్ చేసి తరువాత బ్లాక్‌మెయిల్ చేసేవాడిని ఊరికే వదిలేయడమా?" హరిత సాలోచనగా అంది.

"నీవు నాకేదన్నా సలహా చెప్పవే తల్లీ. ఐ డోంట్ వాంట్ టు లూజ్ గౌతమ్."

"సరే, ఈ రోజు ఆదివారమేగా మా ఇంటికి రా. ఇద్దరం ఆలోచిద్దాం. ఊరికే టెన్షన్ పడకు."

* * * * * *

"ఏయ్ దినేష్ ఎందుకలా ఎస్సెమ్మెస్‌లు పంపిస్తున్నావు. నీకేం కావాలి?"

"నీవే కావాలి" కొంటెగా అన్నాడు దినేష్

"షటప్. మనిద్దరం గుడ్‌బై చెప్పుకుని ఐదునెలలయింది. ఇప్పుడు మళ్లీ నా వెంట ఎందుకు పడ్డావు?" కోపంగా అరిచింది.

"దూరం అయ్యాక నీ మీద ప్రేమ ఎక్కువయింది డార్లింగ్. నిన్ను వదులుకోలేననిపిస్తుంది."

"చూడు, నీ పిచ్చివేషాలు నాదగ్గర కాదు, నీవేమిటో నాకు బాగా తెలుసు. ఈ బ్లాక్‌మెయిలింగులు ఆపు. నీకేం కావాలో చెప్పు. నేను దీనికి భయపడేదాన్ని కానని నీకు తెలుసు."

"అలాగా... సరే, నాకేం కావాలి, నీవు కావాలి. అప్పుడు పెళ్లయ్యాక అంటూ ఊరించి దూరం పెట్టావు. పెళ్లవుతుందిగా, ఇప్పుడు..." విలాసంగా నవ్వాడు.

"ఛా... నోర్మూయ్. పెళ్లి అవుతూంది నాకు. ఇప్పుడిలాంటి వెధవ వేషాలా..." అరిచింది.

"ఏయ్ .. నీ పొగరు మాటలు ఆపు. నీకు రెండే ఛాయిస్‌లున్నాయి. ఒకటి నా కోరిక తీర్చు. లేదంటే ఆ ఫోటోలు ఎవరికి వెళ్లాలో వాళ్లదగ్గరకి వెడతాయి" వికటంగా నవ్వి అన్నాడు.

"చూడు, నేను ముందు నీతో ఓసారి మాట్లాడాలి. ఇంటికిరా."

"ఇళ్లకి రాను. ఏదన్నా హోటలయితే రెడీ."

"నేను హోటల్‌కి రాను. చూడు హరిత ఆఫీసుకి వెళ్లాక దాని అపార్ట్‌మెంట్ తాళం తీసుకుంటాను. అక్కడికి రా, రేపు పదకొండుకి?" ఫోన్ పెట్టేసింది.

"ఓకే... చూడు, ఏదన్నా పిచ్చివేషాలు వేస్తే నష్టం నీకే అన్నది మర్చిపోకు" ఫోన్ కట్ చేశాడు.

చాలాసేపు హరిత, కార్తీక మాట్లాడుకుంటూ కూర్చున్నారు.

* * * * * *

"ఫర్వాలేదే అన్నమాట ప్రకారం వచ్చావు. థాంక్స్ నన్నింకా నీ మనసులోంచి తొలగించనందుకు. మనిద్దరం తప్పు చేశామా దూరం అయి..." దినేష్ కులాసాగా అన్నాడు హరిత ఫ్లాట్‌లోకి రాగానే.

"చూడు దినేష్. నీతో గతించిన ముచ్చట్లు మాట్లాడడానికి రాలేదు. నీకేం కావాలి సూటిగా చెప్పు."

"చెప్పాగా, నీవే కావాలి. పర్మినెంట్‌గా వద్దులే. పాపం పెళ్లి కుదుర్చుకున్నావుగా. ఒక్కసారికి నాదానివి కా. వెరీ సింపుల్ కోరిక నాది" విలాసంగా సోఫాలో కూర్చుని కాళ్లు సెంటర్ టేబుల్‌మీద పెట్టాడు.

"అది కుదరదని నేనంటే..." సూటిగా చూసి అంది కార్తీక.

"ఓకే, రేపీపాటికి మీ శ్రీవారితోపాటు దేశ విదేశాల్లో అందరూ మనిద్దరి ఇంటిమేటు ఫోటోలు ఫేస్‌బుక్‌లో చూస్తారు" తలెగరేసి పొగరుగా అన్నాడు.

"ఇంకా ఫేస్‌బుక్‌లో పెట్టలేదా. నీకంటే నేనే ఫాస్టు అన్నమాట. అప్పుడే నే పెట్టేశా చూస్తావా" హాండ్‌బ్యాగులోంచి "ఐపాడ్" తీసి ఓపెన్ చేసి దినేష్ కళ్ల ముందు ఆడించింది. "ఇంగ్లీషు వచ్చుగా. చదువుకుంటావా తెలుగులో చెప్పాలా... నీకెందుకులే కష్టం. చదువుతా విను" పాలిపోయిన మొహంతో కలవరంగా చూస్తున్న దినేష్ వంక విలాసంగా చూస్తూ "ఈ ఫోటోలో ఉన్న దినేష్ అనే వాడు ఉత్తి దొంగరాస్కెల్. వీడ్ని ఆడపిల్లలెవరూ నమ్మద్దు. ప్రేమ కబుర్లు చెప్పి అమ్మాయిలతో తిరిగి మొహం మొత్తగానే ఇంకొకరిని చూసుకుని, పాతవాళ్ల ఫోటోలతో బ్లాక్‌మెయిల్ చేసి ఏడిపించడం వీడికి వినోదం. పెద్ద శాడిస్ట్. ఆడపిల్లలెవరూ వీడి ట్రాప్‌లో పడద్దని, ప్రేమ కబుర్లకి లొంగవద్దని బ్లాక్‌మెయిల్ చేసి బెదిరించిన ఓ అమ్మాయి చెబుతున్న మాటలు ఇవి"... "ఇది ఇంకో క్షణంలో దేశ విదేశాల వాళ్లంతా చూస్తారు. ఫేస్‌బుక్ అంటే తెలుసుగా నీకు."

"ఏయ్ కార్తీకా..." ఒక్క ఉదుటున కార్తీక మీదకి దుమికాడు దినేష్.

"ఏయ్ అక్కడే ఆగు" చటుక్కున బెడ్‌రూమ్‌లోంచి వచ్చిన హరిత అరిచింది.

"నోరు మూసుకు కూర్చో. ఒక్క అడుగు ముందుకు వేశావంటే పోలీసుల్ని పిలుస్తా" హరిత దినేష్‌ని సోఫాలో తోసింది. దినేష్ మొహంలో రక్తం ఇంకిపోయింది.

"దినేష్ నీవే పెద్ద తెలివైన వాడివనుకుంటున్నావా? సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, ఐపాడ్‌లు మాకూ ఉన్నాయి. ఇంటర్నెట్లు, ఫేస్‌బుక్‌లు మాకూ తెలుసు. అవి ఎలా వాడాలో కూడా తెలుసు. నీవు నన్ను బ్లాక్‌మెయిల్ చేసి భయపెడితే ఏడుస్తూ కూర్చోడానికి నేను పాతకాలం అమ్మాయిని కాను. ఫ్రెండ్లీగా తిరిగాం. పెళ్లి ఇద్దరం వద్దనుకుని విడిపోయాం. ఇన్నాళ్ల తరువాత నా పెళ్లనగానే నీలో అహం తలెత్తిందా. నీవు నా వుడ్‌బీకి చూపిస్తే, నేనెవరికీ చెప్పుకోలేననుకున్నావు. నీ ఎస్సెమ్మెస్‌లు

సెల్‌లో ఉన్నాయి. ఇందాకటి నుంచి మనం మాట్లాడింది, నిన్న మాట్లాడింది సెల్‌లో రికార్డు అయి ఉంది. ఇవి చాలు పోలీసు కంప్లైంట్ ఇవ్వడానికి. రేపీపాటికి నీ బాస్‌కి చెప్పి నీ ఉద్యోగం ఊడగొట్టిస్తా. గౌతమ్‌కి నీవు చెప్పేదేమిటి నేనే చెపుతాను జరిగిందేమిటో. నోరుమూసుకుని పడిఉండి, చేసిన వెధవ పనికి క్షమాపణ చెప్పి కదులు... ఇంకా కక్ష సాధించాలనుకుంటే నాశనం అయ్యేది నీ బతుకే" కఠినంగా అంది కార్తీక.

"దినేష్ నీకు సిగ్గు వేయడం లేదా. పెద్ద చదువులు చదివావు. కార్పోరేట్ ఆఫీసులో మంచి ఉద్యోగం, సంఘంలో పరపతి అన్నీ ఉండి ఇంత చీప్‌గా, ఇంత సంస్కార హీనంగా ఓ అమ్మాయిని బ్లాక్‌మెయిల్ చేస్తావా?" హరిత అసహ్యంగా చూస్తూ దులపడం మొదలుపెట్టింది. "ఏమిటి పాతకాలం అబ్బాయిల్లా అమ్మాయి రాసిన ఏ ఉత్తరమో పట్టుకుని బ్లాక్‌మెయిల్ చేసినట్టు చేస్తే, ఈ కాలం అమ్మాయిలని అంత తక్కువ అంచనా వేయకండి. నౌ గెట్‌లాస్ట్. నీ మొహం చూస్తేనే అసహ్యంగా ఉంది" అతన్ని తలుపువైపు తోస్తూ అతని చేతిలో సెల్ లాక్కుని ఆ ఫోటోలు అన్నీ డిలిట్ చేసి సెల్ విసిరేసి తలుపు ధడాలున మూసింది హరిత.

"ఇంక ఆలస్యం చెయ్యకుండా వెళ్లు. గౌతమ్‌కి ఈ విషయం నీ ద్వారానే తెలియాలి. వెళ్లు అంతా చెప్పు" హరిత అంది.

"ఇప్పుడు చెపితే... గౌతమ్ రియాక్షన్..." నసిగింది కార్తీక.

"ఎలా రియాక్ట్ అయినా ఫేస్ చెయ్యి. జీవితాంతం భయంతో, టెన్షన్‌తో బతకడం కంటే ఇది నయం. వెళ్లు. పెళ్లి తప్పినా పర్వాలేదు. జీవితం అంతా టెన్షన్‌లో బతకడం కంటే..."

* * * * * *

"కార్తీకా, నిన్న ఆంటీ వచ్చి చెప్పిందగ్గర నించి, నీవు నిజాయితీగా నాతో చెపుతావా లేదా అని ఆలోచిస్తున్నాను. చెప్పావు. థాంక్స్" కార్తీక చెప్పిందంతా విని తేలిగ్గా అన్నాడు గౌతమ్.

"అమ్మ వచ్చి చెప్పిందా?" ఆశ్చర్యంగా అంది కార్తీక.

"ఆ... ఆవిడ వచ్చి, నీ ప్రాబ్లమ్ చెప్పి తెలివి తక్కువగా కొంత, అనుభవ రాహిత్యంతో కొంత, అన్నీ నాకు తెలుసు అనే నీ అహం గురించి చెప్పి, నాతో

అంతా చెప్పమని సలహా ఇచ్చానని, కూతురు చెపుతుందో లేదోనని తనే వచ్చి చెప్పానని, అంతా విని ఏ నిర్ణయం తీసుకున్నా తమకి ఆమోదమేనని, నిజం దాచి, అనుక్షణం వాడి బెదిరింపులకి భయపడి జీవితాంతం కూతురు టెన్షన్‌లో బతకడం ఇష్టం లేదని ఆవిడ చెప్పారు. నిజంగా ఆవిడ సంస్కారం ముందు నేను ఇంకేవిధంగా నిర్ణయం తీసుకోగలను. కేవలం నీవు పెళ్లికి ముందే ఈ నిజం చెప్పాలని మాత్రం ఆశించాను. నా నమ్మకాన్ని నిలబెట్టావు. థాంక్స్" అన్నాడు గౌతమ్.

"లేదు గౌతమ్, నిన్నే వద్దామనుకున్నాను. ముందు వాడికి బుద్ధి చెప్పాలని నేను, హరిత మాట్లాడుకుని ఆ రాస్కెల్ ఆట కట్టించాం" అని జరిగిందంతా చెప్పి "ఇంక మళ్లీ ఏ ఆడపిల్ల జోలికి వెళ్లడులే. ఇప్పుడు నీతో చెప్పాక ఎంత రిలీఫ్‌గా ఉందో..." రిలాక్స్‌గా కూర్చుంటూ అంది.

"కార్తీకా, ఓ మాట చెప్పనా... మీ అమ్మగారు చెప్పింది నిజం. ఈ కాలం అమ్మాయిలు చదువుకున్నా ప్రపంచజ్ఞానం తక్కువ. తెలివి తక్కువగా ఈనాటికీ అబ్బాయిల మాయమాటలకి లొంగిపోతున్నారు. ఇప్పుడు ఈ సెల్‌ఫోన్లు, ఫేస్‌బుక్‌ల విజ్ఞానం అందుబాటులోకి వచ్చాక ఇదివరకటి కంటే జాగ్రత్తగా ఉండాలి కాని, ఆర్థిక స్వాతంత్ర్యం ఉన్న అహంకారంతో తప్పటడుగులు వేస్తున్నారు."

"ఏయ్ ప్రవచనాలు చెప్పకు. ఇంట్లో అమ్మ ఇక్కడ నువ్వా... అమ్మాయిలని అంత తక్కువ అంచనా వేయద్దు. మాకూ తెలుసు ఎలా ఎదుర్కోవాలో" గర్వంగా అంది.

"ప్రవచనాలలో చెప్పేవి ఆనాటికే కాదు ఈనాటికీ ఆచరించతగ్గవే. అమ్మాయిలని వంటింట్లో కూచోమని ఎవరూ చెప్పడం లేదు. అతిగాపోయి గీత దాటితే నష్టం వారికే. అమ్మాయిలే ఎవరికి వారే లక్ష్మణరేఖలు గీసుకోవాలి."

"అవును గౌతమ్, అన్నీ తెలుసునన్న పొగరుతో ప్రవర్తించాను. నువ్వు అర్థం చేసుకోకపోతే నా పరిస్థితి ఎలా ఉండేదో" కార్తీక గొంతులో నిజమైన పశ్చాత్తాపం పలికింది.

(ఆంధ్రభూమి సచిత్ర వారపత్రిక, 23.2.2012)